Reg. No. 757

అభినవసరస్వతి

[మాసపత్రిక]

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రిచే
ప్రచురింపఁబడుచున్నది.

గుంటూరు.

సంపుటము 33 { 1941 సం॥ జూలైనెల 15 వ తేది } సంచిక 4

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	10 0 0	చందాదారులకు	రు 3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Guntur by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravyavaharam
etc., etc.

రాజపోషకులు.

శ్రీమంతు, రాణీ ఆదిలక్ష్మీదేవమ్మ బహాదరుగారు,
గద్వాలసంస్థానము.

ప్రధానపోషకులు.

౧ శ్రీశ్రీ జగద్గురు సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారు,
హంపి.

౨ శ్రీశ్రీ జగద్గురు, అభినవోద్దండ విద్యాశంకరభారతీ
స్వాములవారు, పుష్పగిరి

3 తంగెడ నరసింహారావుగారు, కరణము, మోర్జంపాడు.

౪ ఆర్. రామారెడ్డిగారు, దైవముదిన్నె.

౫ రాజా సురభి వెంకటరత్నాంబ బహాదరుగారు,
రాణీ, ఆఫ్ జటప్రోలు, కొల్లాపురము.

౬ శ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి.

౭ రాజా రఘునందనసింగుగారు, నెల్లుట్ల.

౮ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురము.

౯ రామచంద్రారెడ్డి దేశముఖుగారు, ఇసునూరు.

పోషకులు.

౧ జాగర్లమూడి కుప్పుస్వామినాయుడుగారు, కారంచేడు.

౨ రాజా కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహద్దరు
జమీందారుగారు - దేవిడి

3 కాండ్రి వెంకటకృష్ణారెడ్డి దేశముఖుగారు, బసవాపురము

అభినవసరస్వతి

సంపుటము 33 | వృష నామసంవత్సరము ఆషాఢమాసము | సంచిక ౪

—♦ కృతివిమర్శము ♦—

దివ్యవాణి విజయసంచిక.

దివ్యవాణీసంపాదకులగు చిఫుకుల, అప్పయ్యశాస్త్రిగారు సనాతనపక్షమునఁ జలమూని ప్రకటింపఁబడు వారపత్రిక లేదన్న వాదు పోఁదోలుటయే కాక యాంధ్రదిపత్రికాసంపాదకులవలె ననుబంధగ్రంథముగూడ నాంధ్రుల కందఁజేసి యపూర్వమైన యశ మార్జించుట కభినవసరస్వతి యానందించుచున్నది. త్రయస్త్రింశద్వత్సరములనుండి తాఁ జేయు ధర్మప్రచారమునఁ దద్దయుఁ దోడ్పడుచు వత్సరత్రయమునుండి సత్సదనసహస్రములు సమలంకరించుచుండుటయే కాక విజయసంచిక పేర విష్టపవ్యాప్తయగు నవ్యసోదరి దివ్యవాణికి దీవన లొసంగుచున్నది. శ్రీశ్రీ జగద్గురు గోవర్ధనపీఠాధీశ్వరులు శ్రీ కల్యాణానందభారతీస్వాములవారు, ఉప్పులూరి గణపతిశాస్త్రులుగారు ముస్త్వాల వెంకటకృష్ణశ్రేష్ఠిగారు రావుసాహెబు బూరుగు మహాదేవశ్రేష్ఠిగారు మున్నగు మహాపురుషుల ఫోటో లెన్నియో యిందుఁ బొందుపఱుపఁబడియున్నయవి. స్త్రీవిద్యోపాసనాదిదైవికవిషయములను గుఱించిన వేదశాస్త్రజ్ఞులచే వ్రాయఁబడిన వ్యాసములచేతనే కాక పురాణభాషావిదుల యసమగ్రజ్ఞానమును సూచించు చారిత్రకవిషయములచేఁగూడ నీ విజయసంచిక విరాజిల్లుచున్నయది. వర్తమానపరిస్థితిని బట్టి వ్యావహారికభాషావ్యాసములును బ్రకటితములు. సంపాదకులు సంస్కృతాంధ్రపండితులును సనాతనధర్మప్రచారబద్ధకంకణులును నగుటచే ధర్మబోధకములును శాస్త్రబద్ధములును నగు చాలవిషయములకు స్థలమొసంగుట సహజమే. భావగీతాదులకును బలుప్రతిబింబములకును బ్రవేశమిచ్చి దేవానాంప్రియులఁగూడఁ దృప్తిపెట్టఁగలిగిరి. ఇట్లీవిజయసంచిక సనాతనపక్షప్రచురణములలో వినూతనమై పండితపామరుల కెల్లరకును బరమాహ్లాదము గలిగించుటకుఁ బ్రశంసించుచున్నవారము. ఇయ్యది 200 పుటలతోను 75 బ్లాకులతోను ఠీవిఁగులుకుచున్నది. వెల 1-8-0. వలయువారు "శ్రీరామా బుక్ డిపో, 4000 మార్కెటుస్ట్రీటు, సికింద్రాబాదు - దక్కన్" అని వ్రాసికొనవలెను.

—♦ శ్రీశ్రీ జగద్గురు విరూపాక్షపీఠ సంచారము ♦—

శ్రీశ్రీ జగద్గురు విరూపాక్షపీఠాధిపతులు నిజామురాష్ట్రమునకుఁ జేరిన యేదులాబాదను నొక జిల్లాగ్రామమునఁ దత్రత్య శిష్యప్రార్థనచే గజోత్సవాదులతోఁ బ్రవేశించి స్వ విద్యాశంకర దర్శన తీర్థ ప్రసాదములచే జాతుర్వర్ణ్యజనులం బవిత్రులఁ జేయుచున్నారు. పైడిమఱ్ఱి చంద్రశేఖరశాస్త్రులుగారును, కళ్లా, అగ్నిహోత్రశాస్త్రులుగారును

ప్రతిదినము ధర్మోపన్యాసములు చెప్పి కర్మజ్ఞానములపై జనులకుఁ గడు శ్రద్ధ గలిగించు చున్నవారు. కొలఁదిదినములలో శ్రీస్వాములవారు గోదావరీతీరస్థ వాసరక్షేత్రప్రాంతము నకు వెడలనున్నారు.

—♦ మహాభారతకాలస్వరూపము ♦—

[శిష్ట్లా సూర్యనారాయణశాస్త్రిగారు]

పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ... సంకీర్ణసంభవులైన పాండవులను గురు రాజు లంగీకరింపరని ... యీకాలములోఁ బ్రజలు మహత్త్వముల విశ్వసించు మూఢు లగుటవలన... నమ్మించుటకై ... దేవతామహత్త్వము లారోపించి వారి జన్మలను ... గూఢపఱచి ... రని వ్రాసియున్నారు ... దేవతామహత్త్వము లేని ఐతిహ్యము లేదు ... గ్రంథమున కాస్తికత్వము ముఖ్యముగా నుండవలయును. లేనిచో నాగ్రంథము వలనఁ బ్రపంచమున కుపయోగము లేదు. ఉత్తమకవిచే వ్రాయఁబడిన గ్రంథ మైహికా ముష్మికములకు రెంటికి నుపయోగముగా నుండవలయును ... లోకజ్ఞానము శాస్త్రజ్ఞా నము లేమిచే నవనాగరికులు దేవతామహత్త్వప్రాఁతలవలనఁ జెడుగు సంభవించినదని తలంచుచున్నారే కాని నిజముగా నటువంటివ్రాఁతలవలనఁ జెడు గొంతమాత్రము లేదు. ... దేవతామహత్త్వములు వినాగాఁ జరిత్రలను వ్రాసినచో నిప్పటివఱకు దేశమంతయుం నాస్తికమే యయియుండును. దేవతామహత్త్వములు బూటకములని ... వ్రాయుటచే లోకమునం దాస్తిక్యము చెడి ప్రజలందఱు నాస్తికు లగుదురు. దేవపూజయందు ... భక్తిశ్రద్ధలు నశించును. దైవచింత శూన్యమగును. దైవచింత శూన్యమగుటచే లోక మంతయు నాస్తిక ... మగును. నాస్తికులకుఁ బరలోకచింత యుండదు. అందుచేఁ బ్రజలు పాపకర్మలకు వెనుదీయరు. నాగరికతాపిశాచముచే దైవభక్తి హీనమైన యీ కాలమునఁ గూడఁ బూర్వవాసనచేతను దేవతామాహాత్మ్యప్రతిపాదకగ్రంథములచేతను గొందఱైనను గొంతవఱకుఁ బాపకర్మలకు వెనుదీయుచుండిరి. ఈకారణముచేతనే యప్ర మాణములు మొదలైన కొన్ని దుష్కర్మలకుఁ గొందఱైనను భయపడుచుండిరి. ఈ మాచారము ననుసరించియే యీకాలమున న్యాయస్థానములలో సాక్షులు మొదలగు వారిచేతఁ బ్రమాణములు తీసికొనఁబడుచున్నవి. కాని యిప్పు డీప్రమాణవాక్యము లర్థ రహితము లైనవి. పుడమిఱేఁడు న్యాయపథమును దొలఁగకుండుటకై మనువు మొదలగు వారు ధర్మగ్రంథములయందు నరకలోకభయ మమితముగాఁ గల్పించిరి. భరతభూమి యందుఁ గల ప్రజలు న్యాయభూయిష్ఠులై ... అధ్యాత్మచింతకులై త్యాగభూయిష్ఠులై యుండుట కిదియే కారణమని యొక సుప్రసిద్ధపాశ్చాత్య పండితుఁడు వ్రాసియున్నాఁడు. ఇపుడు స్వల్పముగా నున్నయీయాస్తికత్వముగూడ భవిష్యత్కాలమున నశించుసూచ నలు కనపించుచున్నవి. కలియుగమునం దైదువేలవత్సరములకు వర్ణసంకర మగుననియుఁ బదివేలవత్సరములకు దేవతారాధనయు దేవతాయతనములు నంతరించుననియుఁ బూర్వులు వచించియే యున్నారు. ఇక్కాలమున వర్ణాశ్రమధర్మచక్రము నశించి నది. కనుక నిఁక నావిషయమైన విచార మవసరమే లేదు. మిగిలిన దేవతారాధ

నేయు దేవాయతనములు నశించుటకే ... మహాభారతచరిత్రనుబోలిన దుష్టగ్రంథములే సూచనలుగాఁ గనుపించుచున్నవి. శిష్టాచారసంపన్నులైన బ్రాహ్మణులచే ననుదినముఁ బూజింపఁబడిన సాలగ్రామములు తరాజుగుండ్లక్రిందను ... నవనాగరికులైన యుద్యోగస్థులు మేజాలయం దుంచఁబడిన కాగితములమీఁద బరువుగా నుపయోగించు రాళ్లక్రిందను నుపయోగపడుచున్నవి. బ్రాహ్మణోత్తముల దేవతార్చనపుం బెట్టెలయందు సాలగ్రామములకు బదులుగా మంగలకత్తులు సబ్బుబిళ్లలుఁ గుంచెలు నూఱుడురాళ్లు నద్దములు దువ్వెనలు వాసన నూనెలుఁ బటికరాళ్లు సంగ్రహింపఁబడుచున్నవి. గ్రామాంతరమున కరుగవలసిన బ్రాహ్మణగృహస్థు లేమఱక తమ దేవతార్చనల నేరీతిగాఁ గొనిపోవుచుండిరో వారి కుమారు...లీమంగలిపొదుల నారీతిగాఁ గొనిపోవుచున్నారు...

ఏదేవతామహిమలగుఱించి శాస్త్రిగా రాక్షేపించుచున్నారో యాదేవతామహిమలు శ్రీమద్రామాయణమునం దనేకము లున్నవి...శ్రుతి స్మృతి పురాణ శాస్త్ర కావ్యేతిహాసములు మొదలైన సమస్తవాఙ్మయము దేవతామాహాత్మ్యప్రతిపాదకముగా నున్నది. ఆర్యుల యౌన్నత్యము నాగరికత యీశ్వరతత్త్వమునందే యిమిడియున్నది. ...ఈతత్త్వమును నిరసించినవాఁడు లోకకల్యాణమును మొదలంటఁ గూల్చినవాఁడనుటలో సంశయములేదు... ఈకాలమున...దివ్యకథనములు హాస్యాస్పదములుగా నున్నవి.

... పాండురాజునకు దివ్యమగు నొక కారణముచే ధర్ముఁడు మొదలైనవారివలన ధర్మజాదులు జనించిరని చెప్పిన బ్రాహ్మణవాక్యమునకుఁ బాండురాజువలనఁ గుంతియందు సంతానము కలుగుట కవకాశము లేకపోవుటయు నియోగపద్ధతియనియు నభిప్రాయము గాని యనుచితసంబంధమును గప్పిపుచ్చుటకై యవలంబించిన కృత్రిమమని...కాదు. కావున నియోగపద్ధతిచే జనించిన ధృతరాష్ట్రపాండురాజులుఁ బాండవులు నిందార్హులు గారు...నిర్వంశమైన క్షత్రియకుటుంబములయందుఁ గల కాంతలు నియోగపద్ధతిచే... సంతానముం గని వంశములను బెంపొందించుకొనిరి ...

శాస్త్రిగారు భారతకాలమునాఁడు వితంతూద్వాహములు తప్పుగాఁ బరిగణింపఁబడుట లేదని వ్రాసియున్నారు.

... శాస్త్రిగారు చెప్పునవి విధవావివాహములు కావు...వంశోద్ధరణకై...వ్యాసునివలన సంతానముగాంచిన యంబికాంబాలికలు విచిత్రవీర్యుని రాణులుగానే పరిగణింపఁబడిరి. కాని వ్యాసుని రాణులుగాఁ బరిగణింపఁబడలేదు. ... కాన నిచట విధవావివాహప్రసక్తి కవకాశము లేదు. భారతయుద్ధానంతరమునఁ గౌరవ వితంతు వొక్కతెయైనను బునర్వివాహమాడినట్లు లేదు. ...ఇప్పు డీదేశములో సంస్కరణకర్తలు విధవావివాహము నుద్ధరించుటకుఁ బలుపాట్లం బడుచు సాధ్యమైనంతవఱ కక్షతయోనికే కాని క్షతయోనికే కాని వయస్సుగతించిన యవ్వకే కాని వివాహములు చేయుచున్నారు...పూర్వాచారపరాయణులు...చేయఁగూడదని ప్రతిఘటిం...చుచున్నారు.

తరువాత శాస్త్రిగా రాకాలమున...కన్యకలు రహస్యముగా బిడ్డలం గనుట తప్పుగాఁ బరిగణింపఁబడుట లేదని వ్రాసియున్నారు.

... తమవాక్యమునే తాము గ్రహింపలేనివారి కీవిమర్శ లెందుకు ? అటువంటి కృత్యము తప్పే కానిచో రహస్య మెందుకో ? ఆకృత్యము తప్పుగా నెన్నఁబడనిచో నీపాటికి వివాహబంధము తొలఁగిపోయియే యుండును ... చిరకాల మవివాహితలుగా నుండిన కన్యలయం దెచ్చటనైన నొక్క కన్య వ్యభిచరించి రహస్యముగా సంతానముం గని పాఱవేయుటయో భ్రూణహత్యగావించుటయో సంభవించుచుండును. మఱియు నీకృత్యములు రాజకుటుంబములయం దంతఃపురకాంతలలో సంభవించుచుండును. ఈకాలములోఁగూడ రజస్వలావివాహములు చేయుచున్న జాతులలో నచ్చటచ్చట ... జరుగుచున్నవి ... రాజకుటుంబములలో ... సంభవించినచో నిది యిట్టిదని చెప్పుకొనుటకుఁ గాని బట్టబయలుచేయుటకుఁగాని యవకాశమే యుండదు. మహారాజగు కుంతిభోజుని కొమార్తయైన కుంతి చిన్ననాఁటికృత్య మామె జీవితకాలములోఁ బరమరహస్యముగా నున్నది. కర్ణుఁడు కుంతీగర్భజనితుండని కురువృద్ధులకేనియు ... సుయోధనునకేనియుం దెలియదు. ఈరహస్యము ... కర్ణున కత్యంతపూజ్యులు ... కృష్ణభీష్ములుమాత్రమే ... మూచ్చటింపఁగలిగిరి ... ముచ్చటించి తల్లి కుంతి కర్ణునిచేఁ జీవాట్లం దినెను. ఆ కాలమునం దీకృత్యము తప్పుగాఁ బరిగణింపఁబడనిచో ... కుంతి రహస్యముగా నన్ని పాట్లం బడు టెందుకు ? కర్ణుం డెప్పుడో పాండవులం గలసియుండును ...

ఇచ్చట శాస్త్రిగారు కుంతి తన పాపకృత్యమును వ్యాసునితోఁ జెప్పెననియు నందుకు వ్యాసుం డామె నూఱార్చెననియు గ్రంథమునం దున్నందున నాకృత్య మా కాలమునందు నిషిద్ధమే యగుచోఁ బరపురుషుండైన వ్యాసునితోఁ దనకృత్యము నేల చెప్పుననియు వ్యాసుం డెందుకు సమ్మతించుననియుఁ దలంచి యాకృత్యము లానాఁడు తప్పుగాఁ బరిగణింపఁబడుచుండలేదని తీర్మానించుకొనుచున్నారు.

ఏనాఁ డీపాపకర్మ గావించెనో తదాది నిరంతరచింతామగ్నురాలైయున్న కుంతీదేవి వార్ధక్యదశయందు ...వ్యాసమహర్షితోఁ జెప్పి చింతించుటలో నయుక్తమేమియు లేదు. మొట్టమొదటఁ దన యకృత్యమున కామె పడిన పశ్చాత్తాపమునకు మేరయే లేదు. ... దుర్భరచింతచే ధైర్యము వీడి జేలగాక ... ధైర్యముతో రహస్యముగా... పుత్రరత్నముం గాంచెను. అటువంటిపుత్రుని గడుపుతీపిచే విడువలేకవిడువలేక దుఃఖించి చివరకుఁ గులధర్మము రక్షింపఁగోరియే ... గంగ కర్పించెను. ఈ యకార్య మామె... హృదయమును దహించుచునే యుండెను ... వార్ధక్యమున ... వ్యాసునితో ... దుర్వాసోమహర్షి యనుగ్రహము కర్ణు జననము...మొదలుగాఁగల యావద్వృత్తాంతమును జెప్పి ... మొఱయిడెను ... తనదుఃఖము తన కాప్తుఁడైన వానితో ... చెప్పుకొన్నచో ... హృదయమునందుఁ గొంత విశ్రాంతి గలుగును .. నిరంతరపశ్చాత్తాపతప్తురాలగు కుంతి తన పాపకర్మకుఁ బ్రాయశ్చిత్తమును గోరి ... ఆమహర్షికిం జెప్పి మొఱయిడెను ... మానవుఁడు ... పాపకార్య మాచరించి వెంటనే పశ్చాత్తాపముచే ... ఇఁక...చేయనని...సంకల్పించుకొన్నచో ... పాపపరిహారమగు.. కానఁ గుంతి యీరీతిగానే తన పాపకర్మకుఁ బ్రాయశ్చిత్తముఁ జేసికొని పవిత్రురాలైనది. ఈకృత్య మాకాలమునఁ దప్పుగానిచోఁ గుంతి కీపశ్చాత్తాప మేల ? ...

... కుంతి తన పాపకర్మకు జింతించుచు వ్యాసునితోఁ జెప్పుకొనుటయుం వ్యాసుం డామె నోదార్చుటయు నుత్తమమానవధర్మమే కాని విపరీత మేమియుం లేదు. శాస్త్రిగారు భారతకాలములో నున్న దేశపరిస్థితు లెఱుంగక ... ధర్మార్థతత్త్వమును ... గ్రహింపలేక ... పూర్వమునం దజ్ఞానులచే వ్రాయఁబడియున్న విమర్శలను జదువుటచే ... నాఁటి యుత్తమోత్తములను నిందించుచున్నారు.

పిమ్మట శాస్త్రిగారు ... ప్రపంచమంతయు సంకరమైపోవునని వ్యాసుఁడు వితంతువులఁ బెక్కండ్ర గంగలోఁ ద్రోసెనని వ్రాసియున్నారు.

బ్రాహ్మణునకు శూద్రస్త్రీయందు జన్మించిన నిషాదుం డనియు ... క్షత్రియ వితంతువులతో 'భోగించినవాఁడనియుఁ గుంతీదేవి వ్యభిచారము ధర్మబద్ధమని చెప్పి దాని కంగీకరింపఁజేసినవాఁడనియు భరతఖండాచారవిరుద్ధమైన ద్రౌపదీవివాహమును ద్రుపదునిచే బలవంతముగాఁ జేయించినవాఁడనియు ... ధర్మపక్షీయుఁడైన సుయోధను ద్వేషించినవాఁడనియుఁ బాపకర్ముండైన శ్రీకృష్ణుని బ్రశంసించినవాఁడనియు ... కౌరవుల కీర్తి డిందుపఱచి పాండవులకుఁ గీర్తి నాపాదించుటకై న్యాయ మన్యాయముగాను నన్యాయము న్యాయముగాను భారతమును రచించినవాఁ డనియు ... సంకీర్ణసంభవులు ... వర్ణాంతరస్త్రీలను వివాహమాడినవారు ... స్వసంఘాభివృద్ధికై ప్రయత్నించినవారు నగు పాండవులయెడఁ బక్షపాతముగలవాఁడనియు నిర్ణయింపఁబడిన వ్యాసున కీ ధర్మబుద్ధి యెట్లుజనించెను ? ... సంకరసంతానభయము వ్యాసున కెట్లు గలిగెను ? సంకరసంతానరాహిత్యముగా భరతభూమిని బరిశుద్ధమొనరింపఁదలంచిన వాఁడు కౌరవవితంతువులను గంగలోఁ ద్రోయవలసివచ్చునంతవఱకుఁ జూచుచుండవలసినకర్మ మేల ? ... సంకీర్ణులైన పాండవుల యెడ నేల యుపేక్షవహించలేదు ? ఇంతవఱకు లేని ధర్మబుద్ధి చివరకుఁ గౌరవవితంతువులను గంగలోఁ ద్రోయుట కెట్లుదయించెను ? పాపమిది యావితంతువుల పాపపరిణామము కాఁబోలు ? ... యావత్ప్రపంచము నేకచ్ఛత్రాధిపతిగా నేలిన దుర్యోధనుని భార్యలుం ... తక్కుంగల కురుకాంతలు బంధు పుత్ర మిత్ర భర్తృ మరణముచే దుఃఖార్తలై యున్న వారి ... దుఃఖోపశమనముచేయ ... నిశ్చయించి యొకనాఁ డందఱిసమక్షమున ... మీకిష్టమైనదానిని గోరుఁడు, ... నాతపశ్శక్తిచే దాని నవలీలగా మీ కొడఁగూర్తునని చెప్పఁగా వారు... యుద్ధమృతులైన మా పతి పుత్ర మిత్ర బంధు పరివారములం జూపింపుఁడని కోరఁగా వ్యాసుఁడు వారినందఱ గంగానదియొడ్డునకుం గొనిపోయి జలాంతరమున యోగశక్తిచే యుద్ధమృతుల నందఱిం జూపింప ... మహాశ్చర్యమగ్నలైరి. పిమ్మట నిష్టమున్నవారు పతుల ననుగమింపుఁడని వ్యాసుఁడు వారికిం జెప్ప నం దిష్టమైనవారలే పతుల ననుగమించిరి ... అంతే కాని భరతభూమిని సంకరసంతానరాహిత్యముగా నొనరించుటకు వ్యాసుఁడు కుతంత్ర మవలంబించి ... హాస్యాస్పదుఁడు గాలేదు ... వ్యాసుని దివ్యశక్తిని గ్రహింపలేక మనమే హాస్యాస్పదుల మగుచున్నాము ... సినీమా ... శాస్త్రిగారు ... చూచుచున్నారుగాన వ్యాసుం డా... చూపిన యద్భుత...ము సినిమా ... వంటిదని భ్రమపడుచున్నారు. సినిమా ... చూడకపోయినచో వ్యాసకృత్య మంతయు

శుద్ధాబద్ధమని .... కొట్టివేసియుందురు ... వ్యాసునికడ సినిమా ... సామగ్రి యేమియు లేదే ? ఇది సినిమాప్రదర్శనమే యగుచో నెంత సామగ్రియుండవలె ! ఎందఱుపరిచారకు లుండవలె ? మన మెఱుంగని యద్భుతవిషయములను బ్రత్యక్షప్రమాణములు లేనిచో నవి యన్నియు నబద్ధములని తలంచుట కేవల మయుక్తము ...

శాస్త్రిగారు ఆకాలమునఁ గౌరవపక్షమునందే ప్రజల కెక్కువ యభిమానముగల దనియు నందుచేతనే సుయోధనునకుఁ బదునొకండక్షౌహిణుల సేనలు సమకూడినవనియు వ్రాసియున్నారు.

నాఁడుగాని నేఁడుగాని పాండవపక్షమునందే ప్రజల కెక్కువయభిమానమున్నది. నేఁటికాలమునఁ బ్రాకృతజను లందఱికిఁ బాండవులు దేవతలనియే నమ్మకము. దుర్మార్గమునకు దుర్యోధను నుపమానముగాఁ జెప్పుకొనుచుందురు. కార్యవిఘాతకునిం జూచి శకుని దాపరించెనని నిందించుచుందురు ... నవనాగరికుల మని చెప్పుకొనుచున్న యజ్ఞాను లేకొలఁదిమందియో ... కౌరవపక్షమునకుఁ బరుగిడుచున్నారు ...

ధర్మజుం డఖండభూమండలసామ్రాజ్యమును ... ద్యూతమునం దోడి సుయోధనుపాలు గావించి యరణ్యగతుఁడై యున్నాఁడు ... రానున్నయుద్ధమునకై సైన్యసంగ్రహము చేయుటకు వారికడ గవ్వైనను లేదు ... సమకూర్చుట కవకాశము లేదు ... సుయోధనుఁడు చక్రవర్తియై ... సైన్యములను సమకూర్చియున్నాఁడు. పదుమూడు వత్సరములు ... పాండవసంహార మొక్కటే లక్ష్యమునం దుంచుకొని ... ప్రయత్నించిన సుయోధనున కానాఁడు లోక మనుకూలమై పాండవుల ద్వేషించియున్నచోఁ బదునొకండుగాదు, నూటపదునొకం డక్షౌహిణులు సమకూడియుండును. ... దూరదృష్టితో సామ్రాజ్యమును బ్రజారంజకముగాఁ బరిపాలించుటచేతను యుధిష్ఠిరునికంటె ముందు ... భూపతుల సహాయ మపేక్షించుటచేతను ... పాండవులకు సహాయము చేయుటకై చనుచున్న శల్యుని వంచించి తనపక్షమునం గలుపుకొనుటచేతను ... సాత్యకిని బాండవపక్షమునకుఁ బంపుటకై యాదవులు...అక్షౌహిణిసేనతోఁ గృతవర్మను గురుపక్షమునకుఁ బంపుటచేతను ధుర్యోధనున కంతవఱకైనను సైన్యములు సమకూడినవి కాని లేనిచోఁ బాండవపక్షమున కెన్నియో రెట్లు తీసిపోయియుండును. సైన్యసంగ్రహము చేయుట కేవిధమైన సదుపాయములు లేక సమయమును గడపివచ్చిన ధర్మజున కేడక్షౌహిణులు సమకూడుటచే నాకాలమునందుఁ బ్రజకుఁ బాండవపక్షాభిమాన... మెంతవిశేషముగానున్నదో తెలియుచున్నది ...

తరువాత శాస్త్రిగారు పాండవులు సంకీర్ణులగుటవలన సంకీర్ణు లందఱు యుద్ధమునందు వారికే సహాయముగావించిరనియు నీసంకీర్ణతవలననే బంధువులుగూడఁ బాండవులను ద్వేషించి త్యజించిరనియు వ్రాసియున్నారు.

... పాండవులు సంకీర్ణులని ... ద్వేషించినచో ముందు చంద్రవంశమునే ద్వేషింపవలెను ... చంద్రుఁడు మొదలు ధృతరాష్ట్ర పాండురాజులవఱ కెవ్వరిని ద్వేషింపని ప్రజలు చివరకుఁ బాండవుల నెట్లుద్వేషించిరి ? ... గానఁ బాండవులయందు సంకీర్ణత లేదు ... జ్ఞాతులు బద్ధశత్రువులు నగు ధృతరాష్ట్రాదులు కుంతీపాండవు

లుత్తరకురుభూములనుండి యేతెంచిననాఁడు వీరు ... పరిత్యజింపఁదగినవారని ఋషులు సమక్షమున వాదింపలేదు. లేశ యీవిషయమైన యనిష్టమైనను సూచింపలేదు ... సంకీర్ణులనుట కవకాశ మున్నచో ధృతరాష్ట్రాదు లానాఁడే పాండవులను ద్రోసిపుచ్చి యుందురు. ... యదువృష్ణిభోజాంధకకురువంశీయులు ... పాండవులతో బంధుత్వములు గావించిరి.

సాంబుఁడు సుయోధను కొమార్తను వరించిననాఁటి సుయోధను చర్యనుబట్టి యాదవులు సుక్షత్రియులు గారని శాస్త్రిగారు సూచించుచున్నారు.

బద్ధశత్రువులగు పాండవులకుఁ బరమమిత్రుఁడగు కృష్ణునితోడి సంబంధము నంగీకరింపక ... సాంబుఁడు స్వతంత్రించి తనకొమార్తను గ్రహించుటచేఁ గోపించి యతని బట్టి చెఱసాలయందుంచెనుగాని యాదవులు సుక్షత్రియులుగారని దుర్యోధనాభిప్రాయము గాదు ... చేదిరాజగు దమఘోషుని భార్య సాత్వతి శిశుపాలుని తల్లి. శిశుపాలుఁడు పాండవులకుఁ బరమాప్తుఁడు ... రుక్మిణి వివాహసందర్భములో ... శత్రువైన శ్రీకృష్ణు ... రాజసూయమునందు ... పూజించినకారణమున ధర్మజు నాక్షేపించి సభనుండి వెడలిపోయెను. అపుడుగూడఁ దన్ను బ్రతిమాలు ధర్మజు వారించిన భీష్ము దూషించెను గాని ధర్మజు దూషింపలేదు. ... భీష్ముని యాలోచనచేఁ బాండవులుగూడ గౌరవవిహీనులగుచున్నారని నుడివియున్నాఁడుగాని ... సంకరులని నిందింపలేదు ... వసుదేవు తోఁబుట్టువు లైదుగురిలో మొదటిది ... కరూశదేశాధీశు ... భార్య. ఈదంపతులకే... దంతవక్త్రుఁడు జన్మించెను. ఇతఁడు శ్రీకృష్ణుని ద్వేషించి చివర కతనిచేతనే కథావశేషుండయ్యెను. రెండవది ... కేకయాధీశుని భార్య. ఈమె తనయులు పాండవపక్షమే యవలంబించిరి. మూడవది రాజాధిదేవి యవంతిదేశాధీశుని భార్య. ఈమె తనయులైన విందానువిందులు ... శ్రీకృష్ణద్వేషులగుటచే ... దుర్యోధనుపక్ష మవలంబించిరి. నాలవది ... సాత్వతి ... అయిదవది ... కుంతీదేవి ... వీరిలో నెవ్వరును సంకరు లను హేతువుచేఁ బాండవులను ద్వేషించినవారు లేరు ... మణిపూరపురాధీశుఁడగు చిత్రవాహను కొమార్తయుఁ బార్థు భార్యయు నగు చిత్రాంగదయందు జన్మించిన బభ్రువాహనుఁడు మాతామహవంశోద్ధరణకై చిత్రవాహనున కర్పింపఁబడెను ... పాండవు లాహ్వానింపకపోవుటనో వంశాంతరముగా నున్న యితనిఁ బంపుటకుఁ జిత్రవాహనుఁ డంగీకరింపకపోవుటనో యుద్ధమునకు రాలేదు ... మిగతబంధువు లందఱు ... సంపూర్ణముగా సహాయము గావించిరి. కావున సంకీర్ణులనెడి హేతువుచేఁ బాండవుల ద్వేషించిన బంధువు లెవ్వరును లేరనియు ... పాండవోత్పత్తికి హేతువైన నియోగపద్ధతి భారతకాలమునాఁ డాపద్ధర్మానుకూలముగా నాచరింపఁబడు పవిత్రాచారమనియు సంకీర్ణత యనునది కేవలము శాస్త్రిగారి హృదయమాలిన్యమనియుఁ బ్రాజ్ఞులు గుర్తెఱుంగుదురుగాక ... మహాభారతకాలము మహాభారత పురుషులు మహోత్తమము మహోత్తములు ననుటలో సందేహ మేమియుఁ లేదని విన్నవించు .. చున్నాను.

శ్రీ

—♦ అనవసరపు దిద్దుఁబాట్లు ♦—

(శతావధాని శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు)

శారయ్యగారి కవిత్వములో ననవసరముగా దిద్దిన దిద్దుఁబాట్లు కనఁబడఁగలవు.

(1) వృథాకరింపకయిచ్చు (2) చిహ్న లెల్ల విడిచి చేరికొల్చి.

ఇందు మొదటిదాని వృథసేయక యిచ్చుననియు రెండవదానిని జిన్నెలెల్లవిడిచి యనియుం సంస్కరించినారు. కారణము మృగ్యము. మొట్టమొదటిది చక్కని ప్రౌఢ ప్రయోగము. దానిని జెడఁగొట్టినట్టయినది. రెండవదో ? వీరరసము చెడినది దిద్దుటచేత. ఎందుకుదిద్దవలసివచ్చిన దనిన ? చిహ్నములని ముపర్ణక ముండిననే కాని వ్యాకరణము బాధించెడినని. వ్యాకరణమున కీమాత్రము తెలియును. దాని నుపయోగపఱచుకొనుట తెలియక మనమే యుక్కిరిబిక్కిరై కొన్నిప్రయోగాల సొగసు చెడఁగొట్టుచుండెదము. శ్రుతిపేయముగానుండెడి చిహ్న, మధ్య లోనైనవి ముపర్ణవిరహితముగాఁ గూడ వాడుకో వచ్చుననియే యొకగణము నేర్పఱచినది వ్యాకరణము. ఇఁక మనలోపమే కాని దాని లోపము లేదు. ఇతరత్ర చిహ్నయనెడి ప్రయోగము దిద్దనిదియు నున్నది ద్వితీయము లోనో, తృతీయములోనో. ఈలాటివి కొన్ని యిప్పటివారే దిద్దియున్నారో పూర్వులే దిద్దియున్నారో కాని యెవరుదిద్దినను ననవసరమే యని నే ననుకొనియెదను. కొన్ని కష్టసాధ్యాలు దిద్దకుండను నుంచినారు. అట్టివి స్వల్పముగాఁ జూపఁగలను.

చెలువంబు నెఱిదప్పి చిన్నఁబోవుచునున్న వదనారవిందంబు—ఇందులోనున్న చిన్నఁబోవునసెడి పదములో నఱసున్న యెటులవచ్చినది? అది యేదో నకారము చెడికదా రావలె ! ఆపద్ధతిని దాని మొదటిరూపము చిన్నన్, అని యుండవలెననెడి శంక వారి కప్పటికిఁ గలుగకపోయినందుకు సంతోషించవలె. మూఁడో నాలుగో యంగుళములలో నిమిడిన తెలుఁగువ్యాకరణమునకుఁ జిన్నఁబోవులో నఱసున్న యేలాగువచ్చినదో పదునాల్గు కోటులేనా మఱియున్ - అనెడిచోట, కోటులు, ఏ, అ యని యున్నప్పుడు ద్రుత మేలాగుచేరినదో చెప్పుటకుఁగూడ సామర్థ్య మున్నదని యెవరనుకొనియెదరు ? సర్వసమగ్రమనుకొని పదిపదునాలుగేండ్లు చదువుకోవలసిన శాస్త్రము పాణినీయము. దానికే యేపృషోదరాదులలోనో పెట్టిననే కాని ప్రకృతిప్రత్యయములు రెండును గల్పించుకొని ననే కాని కుదురనివి యెన్నో రూపాలున్నట్లాయా గ్రంథకర్తల ప్రవృత్తివలన నవగతమగుచున్నదే ? మహాగజాః పలాయంతే మశకానాంతు కా గతిః ?

సరే. ఇక్కడ దిద్దుచో నేమనిదిద్దవలెనో యాలోచింతము. చిన్నపోయియని కాని చిన్నవోయియనికాని దిద్దవలె. చిన్నపుచ్చుకొనియని యర్థము చెప్పవలె. పోవు ధాతువుకుఁ బుచ్చుకొనియనెడి యర్థ మెక్కడినుండి కొనితెచ్చెదరు ? తెచ్చెదమే యనుకొనుఁడు. చిన్నయనుచో నేమి ? అది విశేషణమా ? విశేష్యమా ? విశేషణము. చిన్న వస్తువును స్వీకరించి యనెడి యర్థము రాఁగలదు కాని యప్పుడుమాత్ర మభిలషితార్థము రాఁగలదా ? అసకృదావృత్తిగానున్న యీచిన్నఁబోవుప్రయోగమును దిద్దక 'లోకోక్తీనాం భవేద్యోగో యథావచ్ఛ్రుతిరంజన'మని సమాధానపడ్డట్టు నాకుఁ దోఁచి

నది. అయితే నిది లోకోక్తి కాఁగలదాయని యొకశంక రావచ్చును. కాని లోకోక్తి కాకపోయినను దత్తుల్య మేయని సమాధానము వ్రాసినఁ జాల వ్రాయవలె.

అసమగ్రముగానున్న యీవ్యాకరణ మెంతయుపకారక మో యవుదున్నదని నే నెన్నాళ్ళనుంచియో మొఱపెట్టుచునే యున్నాను. వినెడి దిక్కు కనఁబడదు.

నాకితఁడు లక్ష్యమా యని ప్రయోగించిన లక్ష్యమా యేమి? లక్ష్యుఁడాయని యుండవలె.

గురువెవరని ప్రయోగించిన గురు వేకవచనముగదా, ఎవరు బహువచనమనుచు శంకించుటయే కదా! అపట్ల భారతము తిరుగవేసినఁ జుట్ట మెవ్వ రతనికిఁ, అని దొరకినది కనుకఁగాని లేకపోయిన గతియేమి? ఈభారతప్రయోగము దొరకినతరువాత నాత్రే పకులను సలహాయిచ్చిన పెద్ద లిద్దఱును మెల్లగాఁ దప్పుకొని భారతములోనున్నప్పుడింకను సందేహ మేమనుట కుపక్రమించినారు.

లోకవ్యవహారానుసారముగానే మహాకవు లందఱును దేశభాషాకవిత్వములు నడిపించుకొన్నారనెడిది యొకటే పెద్దవ్యాకరణము.

లక్ష్యమాయన్నచోట లక్ష్యుఁడా యనిన శాస్త్రము మాట దేవుఁ డెఱుఁగునుగాని చెవి కెంతకఠోరముగా నుండెడినో చూడుఁడు.

శా॥ వ్యాపారమ్ములు లేవు మాకు, వినఁగా నాసక్తియుఁ మెండు, నీ
వా పాండిత్యముగల్గు పుణ్యుఁడ, వగణ్యంబైన మా పుణ్యరే
ఖాపారీణత లభ్యమైతివి...

ఇక్కడ లభ్యుఁడైతివి యనవలెనని శంకించినవారును నున్నారు- ఆపాతరమణీయముగాఁ గనఁబడఁగలదు శంక. సమాధానముచెప్పుటకు సంస్కృతపాండిత్యము పనిచేయఁగలదా? లేక తెలుఁగుపాండిత్యము పనిచేసెడినా? పైప్రయోగము మా సొంతమనుకొనుడు. శరపరంపరగా నిట్టిప్రయోగాలు కవిత్రయము చేసియున్నారు. దీనికి సమాధానమున కేశాస్త్రము నక్కఱలేదు. లభ్యమైతివి యన్న పదద్వయమును గల్పిన వచ్చెడి యర్థము లభించితివియనియే కదా! అప్పుడు దానిలో నీవనెడిదానిని దీసికొనిపోయి యన్వయించిన నీవు లభించితివని చక్కఁగాఁ గుదురఁగలదు. ఇంకొకమాదిరిది భారతము నుండియే యుదాహరించెదను. నమ్మ నేరనయ్యెద. ఇది నన్నయ్యగారిదే. రెండుక్రియాపదము లెందుకనిన జవాబేమి? నమ్మనేరననుచో నభిలషితార్థము వచ్చుటలేదా? సిద్ధిర్లోకా ద్దృశ్యా. ఇంతే జవాబు.

ఇంకొకటి సొగసైన ప్రయోగము చూపఁగలను. వనజాక్షి నేఁగన్క వైజయంతికనైనఁ గదిసియాడుదుకదా కంఠసీమ. ఇది మన నారయ్యగారిదే. నాలుగుచరణము లల ను నున్నది యీకనుక ప్రయోగము. హేత్వర్థకమైన యీకనుకశబ్దమున కిక్కడ సమన్వయము సుఖసుఖములఁ గుదురఁగలదా, తలఁచఁగాఁ దలఁచఁగాఁ గుదురకయే పోఁగలదా? శ. ర. నిఘంటువులో వాక్యాలంకారమని యూరకున్నాఁడు. సహృదయాగ్రేసరుఁడైన యాగ్రంథకర్తకు నా నమోవాకశతకము. అనన్వితమందురు సామాన్యులగుచో. ఇంకొకటి యీయనదే చూపఁగలను. వీరముతోడఁ బంపె జముపీటికిఁ గాఁపు

రము. యమునిపట్టణమునకుఁ గాఁపురము పంపుటయేమి యని ప్రశ్నింపుఁడు. జవా బేమి రాఁగలదు? నాతోఁ జెప్పఁడు చూచెదను. దీని నీలా గుంచుఁడు. అమణి శతథన్వుఁ డపహరించుట నిక్క మెవ్వరిచే దాఁపనిచ్చినాఁడో ?- ఇందులోనున్న చేక్, అన్నది తృతీయావిభక్తిప్రత్యయము గాని హస్తవాచకమైన చేయిశబ్దము కాదు. అదే యగు-నో నౌపవిభక్తిక వికారరూప ముండితీరవలె. ఈతృతీయాంతమునకు సమన్వయ మెక్కడ ? అక్కడ వివక్షితార్థ మేమి ? ఎవరిచేత దాఁపించియున్నాఁడో యనికదా ! ఇంకను బిండితార్థము తీసిన దాఁచవలసినదని యెవరికిచ్చినాఁడో యని తేలెడిని. అప్పుడు షష్ఠి యుండవలెఁగాని తృతీయ యుండదు. ఇవన్నియుఁ జూచి కవిత్వము చెప్పుచో నడుగఁ గలరూ సొగసు! శంకించెడివారైనను నివన్నియుఁ జూచియే చెప్పుచున్నారా ? లేదు. భవభూతి యేమన్నాఁడు ?

శ్లో॥ లౌకికానాంహి సాధూనా మర్థం వా గనువర్తతే,
ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోఽనుధావతి.

వాండ్రు మహాకవులు. నానృషిః కురుతే కావ్యం. ఆవాక్యాల కెంతో చక్కని యర్థ ముండెడిని. అది వినీ వినుటతోడనే స్ఫురించుచునే యుండెడిని. మనము చిన్న చిన్న వ్యాకరణపుఁ బొత్తముల్ సదివి లక్కికి లిక్కి లిక్కికి లక్కి యనుచుఁ గూర్చుండిన నది యెసాభాసయి పోఁగలదు. శ్రీనాథుఁడంతవాఁడు గౌడడిండిమభట్టు కంచుఢక్కను మహాసభలో వాదములో నోడించి పగులఁగొట్టించినవాఁడు నాఁటికాలములో రాజమహేంద్రపుఁబండితుల శంకలకు జవాబుచెప్పలేకే విద్వాంసుల్ రాజమహేంద్రపట్టణము నక్ ధర్మాసనం బుండి ప్రధ్వంసాభావము ప్రాగభావ మనుచుం దర్కించుచు రన్నాఁడా ?

ఇంక మఱొకమాదిరి శంకలు చేసెడిచోట్లు చూపఁగలను. నారయకవీంద్రుఁడు తన్నైన నిచ్చుక్, అన్నాఁడు కుచేలోపాఖ్యానఘట్టములో. శ్రీకృష్ణమూర్తిని సేవించిన నితరలాభాలు కలుగకపోయినను దుట్టతుదకుఁ దన్నైనను లాభింపఁగలవనెడి యర్థము చెప్పుకొనుట కిది యుపకరించెడిననుకొనియెదను. ఈలాటి యపార్థాలుకూడఁ గనెడివా రుండెదరా యనకొనద్దు. ఉన్నారుకనుకనే వ్రాసినాను. ఈలాటివి వెదకెడిపక్షములో నింకను జూపించవచ్చునుగాని ప్రాజ్ఞులు నవ్వఁగలరని యుపేక్షించినాను. ఈతోవను గలము నడిపెడివా రెవరైనను నుండిన వారు కవులుకూడ నయ్యెడిపక్షములో వారి కవిత్వ మంతయుఁ నీలాటిశంకలకు గుఱిచేసి చూపించుటకుఁదగ్గంత ప్రయోజకత్వమును భగవంతుఁ డిచ్చినాఁడు. కాని ప్రాజ్ఞలోక మేమనకొనఁగలదో యనెడి భయమే బాధించుచున్నది.

బలుఁడంగాను మురాసురాంతకుఁడఁగాఁ బ్రద్యుమ్నుఁడంగను. ఈవాక్యములలో మధ్యవాక్యములోనున్న కాను, అనెడిదాని చివరనున్న దుత్వము లోపించుటకు శాస్త్ర మున్నను నిది కొంచెము శంకించెడివారి కవకాశము మాత్రము కలిగించెడిని. ప్రయోగ మీయవలసివచ్చినఁ జాలకాలము వెదకవలె. కాని నిర్దుష్టము.

1. నాకౌకసార్థ మొనర్చి 2 కంకణకేయూరు 3 సదయామతి. ఈమూఁడు చోట్లను శంక కవకాశమున్నది-కాని సమర్థనీయాలే. నాకౌకశ్శబ్దము సకారాంతముగదా! దాని కర్థశబ్దము పరముగానుండిన నాకౌకోర్థమని కావలెనని శంక. సమాధానమో? సంబం

ధార్థమందో స్వార్థమందో యణ్ప్రత్యయము జేసికొన్నప్పటికిని వచ్చెడి వైరూప్య మాదియం దుండదు. అంతమం దణ్ణు చేరి యకారాంతమై యప్పు డకారాంత మయ్యెడిని. అర్థశబ్దముతోఁ గల్పుచోఁ బ్రస్తుతరూపము సిద్ధించెడిని. స్థితస్య గతి శ్చింతనీయా. ఇఁక రెండవది. ద్వంద్వము చేసికొని, అర్శ ఆదిత్వాత్తు నజ్ఞుచేసికొనిన నది కలవాఁడనెడి యర్థము రాఁగలదు. ఆనందో బ్రహ్మవగైరా స్థలాలలో ద్వైతులు దీని ద్వారముగానే తద్వృత్తిను సమర్థించెదరు. ఇఁక మూఁడవది. దయాశబ్ద మతిశబ్దములకు ముందుగా మధ్యమ పదలోపసమాసము చెప్పుకొని యనంతరము సహశబ్దముతో బహువ్రీహి చేసికొనుచో నవ శంకా నవోత్తరముగాఁ గుదిరిపోఁగలదు. దయామతి కరుణామతి వగైరాలు తఱచు భారతాదులదగ్గఱనుంచి వాడెడివే కాని మన నారయ్యగారినాఁడే పుట్టినవి కావు.

ప్రకటయోధవారసాహంకృతుల్. ఇక్కడ సాహంకృతుల్ - అన్నది విశేషణమే యయినను ప్రకరణమునుబట్టి యహంకారముతోఁ గూడుకొన్న యనెడి యర్థము వచ్చెడిని. ఇట్టి విశిష్టవాచకములు కవిత్రయసమ్మతములు.

నిర్వాణమూర్తైన 2 పిశాచపతైన 3 దేవహూతిట్లను. ఈలాటి తత్సమేకార సంధులు పూర్వము భారతములో నుండెడివేమో కాని యిప్పుడు కనఁబడవు. అహోబలుఁ డొప్పుకొన్నాఁడు. ఉదాహరణములుకూడ నిచ్చినాఁడు. తత్సమాకారసంధి బ్రహ్మాంత వాని సంపదేటికి ననెడివాని కున్నంతగాని యొఱఁగెఱఁగి, అటుఁజూపిటు వగైరా క్త్వార్థ కేకారసంధిఘటితరూపాల కున్నంతగాని శ్రవణసుఖము కనఁబడకపోయినను నహోబల పండితుఁడు కావలసినంత చేదస్తుఁ డొప్పుకొనుటయే కాకుండ శ్రవణసుఖమునకు బాగుగాఁ బాటుపడెడివాఁడు రామరాజభూషణుఁ డింకఁ బల్లవుటా ర్చిడఁగరాదని దిద్దరానిచోటఁ బ్రయోగించియున్నాఁడు. ఇప్పటి కెవ్వరును దిద్దలేదు. అందుచేత వానినిగూర్చి చర్చించుటనవసరము. ఇఁకఁడు మురిపమనెడిదానికి యతిస్థానములో మురిపెమని ప్రయోగించుటచేత శ. ర. ని. లో రూపద్వయము నొప్పికొని సజాతీయశబ్దము తిరిపమనెడిదానికి దిద్దరానిచోటఁ బ్రయోగము దొరకక కాఁబోలు రూపద్వయమును వ్రాయలేదు. ఇది నేర్తున్, అనెడిదానికి నేతున్, అనెడి యాపాంతరమువంటిది కాదుకనుక దీనికిఁగూడ నెత్వఘటితరూప మొప్పుకోవచ్చునని నే నభిప్రాయపడెదను.

పోతన్నగారి శిష్యుఁడు నారయ్యగారి కవిత్వమును గూర్చికూడఁ గొన్ని వాక్యములు వ్రాసినట్టయినది. షష్ఠస్కంధము ననువదించిన సింగయకవీంద్రునిగూర్చి యేదో తత్సమాకారసంధిప్రయోగము మాత్రము చూపి కొంచెము వ్రాసినాను. ఆయన కవిత్వము కూడ సాఫుగానుండెడిదే. జీవకవిత్వము కవితామర్మజ్ఞులు గుఱుతించెదరు. ప్రాసనముగా నచ్చుపడ్డదే కాని యిప్పటి యచ్చుప్రతి నా కాయన కవిత్వభాగమున్నది సమయమునకు లభించినది కాదు. ఏవో కొన్నిచోట్ల దిద్దియుండెదరు సంస్కర్తలు. వానినిగూర్చి వేఱేవ్రాయవలసియుండదు. వ్రాసినదానివల్లనే యది గతార్థము కావచ్చును.

— పొగచుట్టదురభ్యాసము —

(గడ్డిపాటి లక్ష్మీనారాయణగారు)

ఈవిషయమును గుఱించి యింతకుము న్నెందఱో వ్రాసియున్నారు....అయిన

వనేకపర్యాయములు కొట్టిననే మేకు గోడలో దిగదు. పదిసార్లు విసరికొట్టిన నేదో యొకసారి తగులకపోవునా ? అట్లే యిట్టివిషయములఁ గూర్చి పలుమా ఱుపన్యసించి నను వ్రాయుచుండినను నెప్పుడైన నీదురభ్యాసముగలవారు గ్రహింపకపోవుదురా యను నభిప్రాయముచే వ్రాయఁబూనితిని

...చుట్టలు త్రాగియే తీఱవలెననియు రుచిగానుండుననియు శరీరమునకు మంచిదనియుఁ ద్రాగుటలేదు. అది చేఁదుగాను నసహ్యముగను నుండుననియు దానివలన నించుకయుఁ లాభములేదనియు నెఱుంగుదురు. కాని చెలికాండ్రు బలవంతపఱచుటచే వారిమాట తీసివేయలేక మెల్లఁగాఁ ద్రాగుట కారంభించుచున్నారు. ఆరంభమున నేమియుఁ గలుగదు. చుట్టనుగాని బీడీనిగాని సిగరెట్టునుగాని త్రాగుచుఁ బొగను నోటిలోనికిఁ బీల్చి పొగయని విడుచుట బహుచిత్రము. రైలుపొగవలె నోటినుండి బయటికివచ్చుచుండును. కాని యది యెంతచెఱుపుచేయువిషమో యెఱుఁగుదురా ? ఇదియుఁ గల్లు సారాయి నల్లమందు వలెనే మత్తుపదార్థము శరీరమును జెఱచును....పెదవులు నల్లఁబడును. ఈపొగ జీర్ణశక్తిని జెఱచు.తినుపదార్థము చక్కఁగా జీర్ణించుకొఱకు దేవుఁడు లాలాజలము (ఎంగిలి) ఇచ్చియున్నాఁడు. ఈయెంగిలికూడఁ బొగవలన మ్రింగుట కిష్టములేక యుమ్మివేయుచున్నారు. ఇట్లుమ్మివేయుటచేఁ దినుపదార్థములు చక్కఁగా జీర్ణములు కావు. పొగవలనఁ జెడిన కొంతయెంగిలి భక్షించుపదార్థములతో గడుపులోనికిఁ బోయి రక్తమును జెఱచును. ముఖతేజస్సు తగ్గును. చుట్టలవలన నెట్టిలాభమును లేదు. కాని నోరంతయు దుర్గంధముమాత్ర మగుచున్నది. ఈచుట్టల...పరాక్రమ మింతయే కాదు....పరాధీనునిగను సిగ్గును మర్యాదయు లేనివానిగను జేయుచున్నది. చుట్టలు పొడుము మొదలగు దురభ్యాసమైనచోఁ దనయొద్ద లేకున్నను ద్రాగు పీల్చువాండ్రకడకుఁ బోయియైనఁ జేయిచాఁచుటకు బుద్ధిపుట్టును....గొప్పవారియెదుటఁ జుట్టలు త్రాగుటకు సిగ్గుండదు. తమయెడ నితరు లేమితలంతురోయను చింతలేదు. గొప్పవాండ్రకు స్త్రీలకుఁ బిల్లలకుఁ బొగత్రాగువారిపై నసహ్యత.

పోనీ యీదురభ్యాసమువలన వ్యయముమాత్రము కొంచెమా ? కొందఱుభాగ్యవంతులు గొప్పదుకాణములలో నమ్మఁబడువాని కొందు రవి రూపాయకు 5, 6 చొప్పున బీదవాండ్రుమాత్రము తక్కువనా ? వారును శక్త్యనుసారముగ ఖర్చుచేయుచున్నారు. దీనికై యెంతఖర్చు చేయుచున్నారో చూతము. కనీసము దినమునకు మూడుపైసలైనను నెలకు 0–7–6. సం॥కు సుమారు 6–0–0. ఇట్లు నూటి కొక్కఁ డొక్కదినమునకు మూడుపైసల బీడీలు కొన్నను భరతఖండమునందలి ముప్పదికోట్ల జనుల కొకదినమునకు సుమారు రు 47000 లగుచున్నవి...బీడీలతోపాటు నిప్పుపెట్టె యుండవలదా? కనుకఁ జెప్పఁబడినవానికన్న రెండింతలు మూడింతలు ఖర్చగుచున్నదని నిశ్చయముగఁ జెప్పవచ్చును....ఎంత ద్రవ్యము నష్టము? త్రాగుటకు గంజిలేక కట్టుటకు గుడ్డలేక యల్లాడువా రెందఱులేరు ? అట్టివారికై యొక నిధి నేర్పఱచిన నెంతబాగుండును? అన్యాయముగ డబ్బిచ్చి రోగములను గొనుచున్నారు. ఇవియన్నియుఁ జక్కఁగాఁ దలపోసి యీదురభ్యాసమును విడుతురని నమ్ముచున్నాను.

—• పిల్లలకు నేర్పఁదగిన సత్యహానాసాదులు •—

ఉద్యోగార్థియగు నొక బాలుఁ డొకవర్తకు నాశ్రయించెను. వర్తకుఁడా చిన్నవానితో నొకవస్తువును మఱియొకటిగ నమ్మించి రెట్టిధర రాఁబట్టఁగలవా యనిన మీ యుత్తరువుల ననుసరించఁగలనని చెప్పెను. ఎంతవేతన మపేక్షించెదవనిన మాసమునకు నూఱురూపాయ లిప్పించుమనెను. వర్తకుఁడు వింతపడి యింత యధిక మడిగెదవేమన నాచే నసత్యములాడించి ధనముగడించు మీర లెక్కువజీత మీయవలదా యని ప్రత్యుత్తర మొసంగెను. అనృతములాడ నవసరము లేనిచో నేమిజీతము వలయునని వర్తకు డడిగినపు డాచిన్నవాఁడు మాసమునకుఁ బదిరూపాయలు చాలునని నుడివెను.

ఒక పల్లెకూటమున నొక యుపాధ్యాయుఁ డొకతరగతిబాలుర నొక నోటిలెక్క యడిగెను. అందఱును దప్పిరి. చివరబాలుఁ డఱువదినాలుగని చెప్పెను. ఉపాధ్యాయుఁ డది సరియని యాబాలు నగ్రస్థానమునఁ గూర్చుండఁబెట్టి యాలెక్కవివరము లాతరగతివా రెల్ల గ్రహించునట్లు నల్లబల్లపై వేసిచూపి ఫలిత మిరువదినాలుగని తెల్పెను. తానుజెప్పినది యిరువదినాలుగు కాదనియు నేనుం దప్పినవాఁడనే యనియుఁ జెప్పుచు నాచిన్నవాఁడు జివ్వునఁ దన చివరచోటికివచ్చి కూర్చుండెను. అతని సత్యాదరణ కెల్లరు నాశ్చర్యపడిరి.

ఋజుమార్గముల వర్ణించుట కిట్టి వెన్నియోని కథ లున్నవి. ఎన్నికథలు విన్నను దదభ్యాసములేనివా రది తెలిసికొని యనుగమించుట దుర్లభము. కావున నీసుగుణమును శిశువు లాబాల్యముగ నభ్యసించునట్లు తద్వృద్ధికాములగు తలిదండ్రులు మిక్కిలి పట్టుదల గలిగి నేర్పుచుండుట వంశాభివృద్ధికరమనియు నాయుర్వృద్ధికరమనియు నెఱిఁగి యుండవలెను. ఆబాల్యముఁ బట్టువడిన ప్రవర్తన మనంతరము మాఱదు.

అనృతములాడువారికి జ్ఞాపకశక్తి యధికముండు టవసరము. వారు వెనుకఁ జెప్పియున్నదానికి నిపుడువచించుచున్నదానికి విరోధము లేకుండఁ జూచుకొనుచుండవలెను. ఇట్టిగట్టితన మమరియుండుట సులభము కాదు. కావుననే యనృతములాడువారు తఱుచుగఁ బట్టువడుచుందురు. సకలవిద్యాపరిశ్రమముకంటె నిర్మలచిత్తమును సదభ్యాసములును బరశ్రేయస్సహనమును శిశువుల భావ్యున్నతికి సాధకమని యెఱిఁగియున్న కృష్ణాబాయి తన కొమరిత కీలక్షణము లలవడ నెడతెగక పాటుపడుచుండెను. విశేషధనము కలిగియుండుటచే నస్థిరమగు గౌరవము కలిగినఁ గలుగును గాని శౌశీల్యముచే సుగుణసంపత్తి వర్ధిలి స్థిరగౌరవము నాపాదించునని తలంచి వేణి యెప్పుడును సంతోషయుక్తచిత్తయై వఱలునట్లును లేనివస్తువులు తెమ్మని బాధింపక తన కున్నవానితోఁ దృప్తి కలిగియుండునట్లును నేర్పుచుండెను. నూఱువిద్యలు నేర్పినదానికంటె నీలక్షణము లుండినఁ జాలునని యామె పలుమాఱు వివరించుచుండెను.

తే. గీ. సత్య మోరుపు శుచి సదాచారములును
సరళభావ మ్భూతదయ తుష్టి సంతసంబు
దైవభక్తియు న్యాయము ధర్మచింత
కలుగ నిర్మలచిత్తంబు వెలయునండ్రు.

ఈపద్యభావమును దలచుచుగ స్మరించుచు వేణీబాయి యెదియేని తప్పొనరించి నపుడు నిజముచెప్పించి తా నందు సంతసించి యా చిఱుతకు నానంద మొదవించు చుండెను. ఆడుకొనుచుండునపుడు తోడిపిల్ల లెపుడేని కొట్టినను గొఱికినను వారిల్లను నేమియుఁ జేయరాదని యాబుడుతల కెఱుకపడునట్లు వివరించుచుండును. వేణీబాయి గాని తోడిబాలికలుగాని శుచిగ నుండునట్లు తెలుసుగఁ గనిపెట్టుచు వారివస్త్రాదిక ముల మురికి గానీక శుచియైనతావుల నాడుకొనఁ జూపుచుండును. ఒకరినొకరు పరు సములాడుకొనకుండ మంచిమాటలు చెప్పియు వారిచేఁ జెప్పించియు మెప్పించుచుండును. ఆడునపుడు చీమలకుఁగాని యితరకీటకములకుఁగాని హానికలుగఁజేయరాదని చూపి భూతదయాంకురము లతిబాల్యముననే నాఁటుచుండును. వేణికి లేని యాటవస్తువులుఁ దినుబదార్థములు నలంకారములు నితరశిశువుల కుండినపుడు వారికి లేక తమకున్న వస్తువులఁ జూపి మనస్సంతుష్టి మొలకలెత్త నేర్పును. నిత్యసంతుష్టి సుఖము నంద గించునని యామె యెఱుఁగుంగావున నెపుడును దన కూఁతునకును నామె తోడి బాలికలకును నగుమొగము లలమునట్లు చూపుచుండును. తాతగారు దేవతార్చనయు దీపారాధనములును జూపి జేజేకు దండములుపెట్టించియు ముఖ్యపర్వముల దేవాలయము నకుఁ దీసికొనిపోయియు నామెకు దైవభక్తి నా కోమలహృదయసీమ నాఁటుచుండును. ఆబాల్యముగ నైనయభ్యాసములే జన్మాంతము నిలుచునని కృష్ణాబాయి నిశ్చయము. ఆడుకొనుటకిచ్చిన చిఱుతిండివస్తువుల సమానముగఁ బంచుకొనున ట్లొనర్చి న్యాయ దృష్టియు నవిలేనివారికి నిప్పించి ధర్మచింతయు నలవడఁజేయుచుండును. తానును గణపతిశాస్త్రియు నింటనుండువారెల్లరును సద్గుణములు గలవారగుటచే నీసహవాసమే వేణీబాయి నీలక్షణములచే నొప్పునట్లలవఱచఁగలిగెను. ఇట్టిసముదాయ మొకచోటఁ జేరుట జన్మాంతరసంచితమని చెప్పనగును. నిర్మలచిత్తము కలవారి నీలోక మెల్లఁ గూడియు జయింపఁజాలదనియు నట్టివారి కోరిక లభ్యయోగముగ సిద్ధించుననియుఁ బెద్ద లనుచుందురు. ప్రతివానికిని జన్మాంతరసంసిద్ధిచేతనే మంచిబుద్ధిగాని చెడుబుద్ధి గాని కలుగుచుండునని మనవారు చెప్పుచుందురు. అందువలననే బుద్ధిః కర్మానుసారిణీ యని మనము వాడుదుము. ఇందువలన నొకని చెయిదములను మాటలను నరసి వాని కర్మమార్గమును గనుగొనవచ్చును.

వేణీబాయి యెపుడేని చెడుపిల్లలతోఁ జేరి యాడుకొనుట గాంచినఁ జేరఁదీసి వారి యందుండు లోపములఁ జూపి మంచి బోధించి యట్టివారి సహవాసముచే నట్టిమాటలుఁ దుడుకుపనులు నలవాటగునుగాన వారితో నాడుకొనవలదని వారించి యెడగలిగించుచు

ఎప్పుడును సత్సహవాసముగల పిల్లలచేతి తనపిల్ల వారితో నాడుకొనునట్లు చేయుచుండెను. శిశువుల బుద్ధి నిలకడలేక తఱుచుగ మాఱుచుండునని మంచినడవడిగల శిశువుల మాటలఁ జెప్పి ముదన్వితఁ గావించుచు దుస్సహవాస మలవడినపిమ్మట నది మాన్పుట కష్టతరమని యట్టియవకాశము కలుగకుండఁ గనిపెట్టుచుండును.

కలహించి క్రూరముగఁ జూచుపిల్లల వారించి మంచిమాటలు చెప్పి యవసరమైనచోఁ దప్పు సవరించి యిఁక నట్లుచేయఁగూడదని గట్టిగఁ దెల్పవలెను. శిక్షించు టవసరమని తోఁచినచోఁ గొంతకాల మాపిల్లలతోఁ జేరి యాడుకొనకుండునట్లు నిర్ణయించవలెను. అందువలన స్వేచ్ఛకును నాటలకును భంగమని వారెఱిఁగి కనిపెట్టి సంచరించెదరు. ఒకపదార్థముం గూర్చి వివాదముకలిగిన నది వారికీకుండ నుంచి వివాదము తీఱిన వెనుక నిచ్చుచుండవలెను. తప్పొనర్చినట్లు ధ్రువపడినపుడు క్షమించఁగోరునట్లు చేయుటుచితము.

పిల్ల లొకరిపై నొకరు కొండెములుచెప్పు నలవాటును మంచిదికాదు. కావున నట్టితరుణముల నాయభ్యాసము బలపడకుండ నిరుత్సాహపఱచుటే కాక మంచిలక్షణములుకల పిల్లలఁ జూపి వారు నట్లుండులాగునఁ బలుమాఱు దిద్దుచుండవలెను. సచ్చరిత్రముకలవారి కథలఁ దఱచుగఁ జదివించుచుండుటచే నట్టిగుణము లలవడును.

పసివారు కొందఱు తమ వస్తువుల నొరులు వాడుకొన నంగీకరింపరు. పరులకడ నుండు నాటవస్తువులఁ దమ కిప్పింపుమని ఘూఱాటము పెట్టెదరు. అట్టితరుణములఁ గనిపెట్టి వారితరులకుఁ దమవస్తువులు వాడుకొననిచ్చున ట్లొప్పించుటయు నొరులవస్తువులఁ గోరరాదని బోధించి సమాధానపఱచుటయు వారి నావలఁ బరద్రవ్యాపేక్షానిరసమునగలవారిగ నొనర్చుటయు మంచిది. పిల్లల కొకసారి యీయమని చెప్పిన వస్తువును మాఱాటము చేసినపుడును నేడ్చెదరనియును నిచ్చినవారికి నేపదార్థముకావలసినను నేడ్పుమొద లిడుచుందురు. అట్టితరుణముల వారియం దనాదరణఁ జూపి యొకటిరెండుసారులు పట్టుదలతోఁ గోరిక నెఱవేర్పకుండిన రోదనము వ్యర్థమని తెలిసికొని యట్లు హఠముచేయుట మానెదరు. ఏడ్పుమానిన నిచ్చెదమని చెప్పి మానుచో నిచ్చి యెపుడేని వలసినపదార్థము సంతోషపూర్వముగ నడిగిపుచ్చుకొను నభ్యాసము కావింపవలెను. బిడ్డల కవసరముగా మన మొనరించు కొన్నియుపచారముల వారొల్లక యేడ్చెదరు. అట్టితరుణముల మన మొనరింపఁబూనిన పని మానఁపరాదు. ఒకసారి పోనిమ్మని మానినచో వారికి మొండితన మలవడి మిగుల మాఱాటము చేయుచుందురు. ఇతరులతో నీవిషయము ముచ్చటించునపుడు వారేడ్చిపోవుదురని యిచ్చితి ననక యీయఁదలఁచి యిచ్చితినని చెప్పవలెను.

శిశువులకు విసుగుదలగలుగున ట్లేడువనీయనుగూడదు. అందువలన వారలు నిరుత్సాహస్వభావముకలవారగుదురు. కావున వారికి వినోదములఁ గల్పించిచూపి సమాధాయించి సంతస మంకురింపఁజేయుచుండవలెను.

బాల్యాభ్యాసమును మాన్పుటకు మానవుని శక్తి చాలదు. బుద్ధిని మార్చుట సులభమే కాని యభ్యాసమును మొదలంట వదలుట దుస్తరము. పసితనమునుండియుఁ దినుట కలవడిన పదార్థములను రుచిపాకములను పెద్దవారయి నిరసింపఁజాలరు. అటులనే కొన్ని యాచారములను నిశ్శేషముగ విసర్జింపఁజాలరు. బాల్యప్రభృతి పట్టుపడిన మనోనిశ్చయమును నమ్మికను మార్చుకొనుటకు సామాన్యమానవుల కసాధ్యము. రమాగమి యిరువదేండ్ల ప్రాయముగల యొక బ్రాహ్మణబాలుఁడును నంతకు రెండేండ్లే తక్కువవయసుగల యొక యువతియుఁ గ్రీస్తుమహమ్మదు మతములం గలసి వారివారి మతాచారముల సహింపఁజాలక వారుపడిన యిడుములఁ దడవుట కడువిచారకరముగ నుండెననియు వలచియు వరించియు భార్యాభర్తలైన వీరు పరస్పరవేషభాషలును రుచిపాకములును ననన్యభావము గలిగింపమిని జీవితశేషము విచారమున గడపిరనియుఁ దద్విషయ మానుపూర్వ్యముగ నెఱిఁగిన ధీశాలి యొకరనియున్నారు.

మన మెట్టిప్రవర్తనకలవారితో గలసిమెలసియుండుట కలుగుచుండునో వారి గుణములును ప్రవర్తనయును బట్టుపడునని నిశ్చయింపవలెను.

ఇతరులకు నష్టికలిగినపుడు జాలియు మంచికలిగినపుడు సంతసమును గలవారు మంచివారని నిశ్చయింపనగును. అట్టివారికి సుగుణసంపత్తిగల మిత్రబృందముతో నయాచితముగఁ బొత్తుకలుగుచుండును. కపటవృత్తిలేని మిత్రులకంటే వేఱుగు ధనముగాని గుణమునిచ్చు మందుగాని లోకమున లేదు. ధైర్యముకోలుపోయినవారికి మిత్రసహాకారవచనము లమృతోపమానములై ముదంకూరములు గలిగించును. మిత్రసమాగమమువంటి ముదావహసందర్భ మొండు లేదు. దానిచేఁ గష్టములెల్ల గట్టెక్కును. నష్టములు తొలఁగిపోవును. మనోమలికితము లడుగంటె బుద్ధికిఁ దేటకలుగును. సుఖోదయమయి స్వస్థత కూర్చును.

ఆ. వె. మంచివర్తనంబు మంచిమాటలుగూడ
పరులహృదయములను వశమొనర్చు;
కలుపుగోలుతనము గలిగించు. దానిచే
సర్వకార్యములును సఫలము లగు.

కలుపుగోలుతన మెపుడును మిత్రబృందముం జేర్చి పరమాహ్లాద మొసంగుచుండును. దీనికొఱ కేమాత్రము ధనవ్యయ మొనరింప నవసరము లేదు. మాటపొందికయు నాదరణమును దీనికి సాధకములు ఇవికలవారి కన్నికార్యములును సాధించుట సుకరము. మంచిమాటలును నుచితవర్తనమును బరహృదయాకర్షకములు. పరుల హృదయముల వశవర్తులుగ నొనరించుకొనఁగలవారి కసాధ్య మేమియు నుండదని లోకమెల్ల నెఱిఁగిన యంశమే

తే. స్ఫూర్జధుస్ఫుటతరభుజాస్ఫోటనుండు
భీకరసటావికటమహాపీవరాంసుఁ
డుగ్రనరసింహుఁ డితని బాహూపపంజ
రాంతరస్థిత లీలాశకుంత మగును. 361
ఉ. స్థూలసరోజజాండచయశోభితమాల ధరించి యుద్భటా
భీలరవం బొనర్చునతివేలవినీలశరీరుఁ డమ్మహా
కాలుఁ డలాబువీణగతి గానవినోదము గూర్చు కేళికా
బాలపికం బగుణ్ సుజనపాలక ! కాలనృపాల సూతికిన్. 362
కం. అనవరతస్ఫూర్జితమై
ఘనదుఃఖశరావళులను గ్రక్కునభావం
బనియెడు కోదండం బీ
తనికరమునఁ బొలుచు చెందుఁ దాన తనర్చున్. 363
క. చలియించులక్ష్యములఁ దాఁ జలియించుచునైన వేయఁజాలిన విలుకాఁ
డలఘువిలాసాన్వితుఁ డతిబలుఁ డీతఁడు భూతవితతిఁ బట్టి వధించున్.

—♦ కృతాంతవిలాసవర్ణనము ♦—

వ అని వచించి రఘుపుంగవుండు మరల నిట్లనియె 365
తే. అనఘ! దుష్టవిలాసులం దగ్రగణ్యుఁ
డైన మఱియొండు కలఁడు కాలాహ్వయుండు
ఇతఁడె కర్తయు భోక్తయై యిజ్జగమున
దైవ మనఁ గాలుఁ డన ద్విధా తనరుచుండు. 366
తే నిజపరిస్పందరూపియై నెగడునట్టి
కాలునకు నిల ఫలసిద్ధికంటె నెందుఁ
గనఁబడదు రూప మితరంబు, కర్మమైన
నీహితంబైన మఱియు లే దితని కరయ. 367
క. ఆతపముచేత మిహికాజాతము నాశంబునందుచందంబున నీ
భూతంబులెల్ల నీతనిచేతన్ నశియించు మహానిశితమయూఖా! 368
తే. గీ. విస్తృతంబయి తోఁచు నీవిశ్వమెల్ల
నతనికిన్ నర్తనాగార మగునుజుమ్ము
అందుఁ దనయిచ్ఛవచ్చినయ ట్లితండు
నాట్యమొనరించుచుండు నానంద మెసఁగ. 369

వ. ఇంక దైవంబు దారుణం బగుకృతాంతనామంబు ధరించి నియతి యను కాంతయందు నిత్యానురక్తుండై కాపాలికవేషంబున 370

సీ. కమలబాంధవ నిశాకర మండలంబులు
కరమూలముల హేమకటకములుగ
బహురత్ననిలయమా బ్రహ్మాండకర్ణిక
హస్తంబునందు లీలాంబుజముగ
ఉడుచిత్రబిందుల నొప్పారు నంబరం
బంగంబునందు నేకాంబరముగ
శీతాంశురుచి నొప్పు శేషుండు గంగయుఁ
బెన్నురంబునఁ బెడజన్నిదముగ
తే. రమణఁ దాలిచి బ్రహ్మాండరంగమందుఁ
దనదు ప్రియురాలు నియతికాంతామతల్లి
యుల్లసిల్లఁగ నృత్యమహోత్సవంబు
సలుపు నెడలేక మునిలోకసార్వభౌమ ! 371

వ. ఇట్టికృతాంతుని చెంత నిత్యకామినియగు నియతికామిని ప్రాణి లభ్య భోగానుకూల కార్యారంభంబుల ననస్తమితసంరంభంబున నప్రతిబద్ధక్రియాశక్తి రూపిణియై యాగమూపాయచంచలంబగు జగన్మండపంబున నృత్యంబు గావించు. అట్టియెడ దేవా! దేవలోకాంతరావళి యీదేవికి దివ్యభూషణంబులు. పాతాలపర్యంతంబగు నాకసం బాపాదలంబమాన కబరీమండలంబు. ప్రాణిరోదనకలకలారావకలితంబై ప్రజ్వరిల్లు నరకపంక్తి పాతాళపాదంబునందు దుష్కృతసూత్రప్రోతంబు లగు చిఱుగజ్జియలు, బహువాసనావాసితం బయి యొప్పు జీవకర్మ సముదయంబుయమనామక లలాటఫలకంబునఁ జిత్రగుప్త చిత్రితం బగు మృగనాభిచిత్రకంబు. మంనీంద్రా! యిట్టి నియతికాంత నిజకాంతుం డగు కృతాంతుని ముఖవిలాసంబులఁ దదభిప్రాయంబు నెఱింగి కల్పాంతంబులందుఁ బగులు నగంబుల రొదతోడ మహాలాస్యంబు గావించు. అట్టియవసరంబున సర్వసంహారకారిణియగు నీయమ. 372

సీ. పక్ష్యుత్పలంబ విభ్రాంతకౌమారవా
హన బర్హి చిత్రదేహములతోడ

భయదచతూరంధ్ర ఝాంకారయుత వికీ
ర్ణ జటాబ్జరుద్రమూర్ధములతోడ
ఉచ్చరద్దివ్యపుష్పోత్కరప్రచుర శ
ర్వాణీ కబరచామరములతోడ
ఉత్తాండవ ప్రచండోర్వీధరాకార
భైరవోదరతుంబిభరముఁతోడ

తే. దశశతచ్ఛిద్రయుత పురందరశరీర
భూరిభిక్షా కపాలక భూతితోడ
శుష్కపృష్ఠాస్థిఖట్వాంగశోభతోడఁ
దనకుఁ దానయి భయపెట్టుకొనుచుఁ దిరుగు. 373

తే. విశ్వరూపధరుండైన విష్ణుమూర్తి
మస్తకావళి యనుపద్మమాల తనదు
కంఠమునఁ దాల్చి యిమ్మహాకాళరాత్రి
లీల నటియించుఁ గల్పాంతవేళలందు. 374

తే. అనఘ ! సంవర్తమేఘంబులను డమరువు
నీమె తన కేలఁ బూని వాయించుచుండఁ
దన్మహారవమున నతిత్రస్తు లగుచుఁ
దుంబురాదులు పర్వులెత్తుమరుచువమ్మ. 375

వ. ఇంకఁ దారకానికరవిలసితంబగు నంబరంబును నిజశిరంబున శిఖిపింఛమట్లు ధరియించి బ్రహ్మాండంబున నఖండతాండవంబు సలుపు కృతాంతునకు 376

చ. హిమనగ మొక్క కర్ణమున నెమ్మికపోఁగగు, రత్నసానుశై
లము శ్రవణాంతరంబున విలాసపుఁ గర్ణికయౌ, దినేశుఁడుర్
గమలవిరోధి చెక్కిళులఁ గమ్మలజోడగుఁ జక్రవాళభూ
భ్రము మొలనూలగుర్, జలధరంబులు మేలిమడుంగు లైతగుర్. 377

మ. వెండియు. 378

మ. గతసర్గప్రకరోద్గతోగ్రతర జాగ్రన్మృత్యువక్త్రావళి
ప్రతిమల్లాయిత భల్లశూల ముసలప్రాసాస్త్రశస్త్రాదికో
ద్ధత నానాప్రధనాయుధగ్రథన సూత్రచ్ఛేషభోగప్రక
ల్పితమౌ మాలయొకండు తద్గళమునన్ వెల్గొందు భీమాకృతిన్. 379

క. మకరమణిశోభితము లగు
మకరాలయసప్తకమ్ము మణివలయములై
అకలంకరుచులతో నిత
ని కరంబులయందు వెల్గు నిరుపమతేజా! 330

వ. ఏవంవిధ రూపగుణశోభితుండగు కృతాంతుండు కల్పాంతంబునందు
నృత్యేచ్ఛ నుపసంహరించి చిరకాలము విశ్రమించి మరల బ్రహ్మాదు
లను సృజియించి జరాశోకదుఃఖాభిభవభూషితయు సర్గరూపిణియు
నగు నృత్యలీలను బ్రచురించు. ఇట్లు. 381

ఉ. బాలకుఁ డాటకై సతముఁ బంకముతోడ నభిన్నలీలఁ బాం
చాలికలన్ రచించుగతి సంయమినాయక! యీకృతాంతుఁ డు
ద్వేల సరిద్వనాగజలధిప్రచయాంచితమైన యీజగ
జ్జాలముఁలన్ సృజించు విలసద్వ్యవహారసమన్వితంబుగన్. 382

—♦ సంసారదురవస్థావర్ణనము ♦—

వ అని నుడివి శ్రీరామభద్రుండు వెండియు నిట్లనియె. మునీంద్రా! కాలా
దుల వృత్తంబు లిటులుండ నస్మదాదుల కీసంసారంబున నాస్థ కలుగు
టెట్లు? ముగ్ధంబులగు వనమృగంబులు లుబ్ధకులచేతం బోలె మేము
దైవాదులచేత వంచింపంబడి విక్రీతులరీతి నస్వతంత్రులమైతిమి. అనా
ర్యచరితుండును గబళనోన్ముఖుండును నగు కాలపూరుషుం డనవ
రతంబును లోకంబు నాపదర్ణవంబునం దోయుచుండు. దహనుండు
జగంబునుష్ణజ్వాలల దహించు చందంబున నితండు జీవుల దురాశల
చేతఁ గాల్చుచుండు. కర్కశాచారుండగు కృతాంతుండు సర్పంబు
వాయువుంబోలె భూతజాలంబు నెడలేక గ్రసియించుచుండు. నిర్ద
యుండగు యముం డార్తులయందేనియుఁ గారుణ్యంబు వహింపఁడు.
కృతాంతుని ప్రియకాంతయు నిసర్గచపలయు నగు నియతికాంత
చలపట్టి నియతులగు వారి ధైర్యంబు, వైధుర్యంబు నొందించు.
సర్వభూతదయోదారులగు పూరుషులు దుర్లభులైరి. బ్రహ్మాది
పిపీలికాంతంబులగు భూతజాతంబులు తుచ్ఛవిభవమాత్రశోభితం
బులు భోగధామంబులగు విషయంబులు దురంతదుఃఖాంతంబులు.
మఱియు 383

— భట్టపాదప్రాదుర్భావము —

ఆ. వె. బంగరమున వెండిఁ బరికల్పితమ్ములౌ
లింగకాయ లలర సర్వాంగములను
ధర శివాగమములఁ దత్పరుల్ గా జనుల్
కర్మ ముండమోసె గరళకంఠ! 27

ఆ. వె. అంగదాదికముల కర్హాంబులై మించు
కమరి నిజభుజములఁ గాల్చుకొనుచు
విష్ణునాగమముల వినుతింప భూజనుల్
కర్మ లుప్తమయ్యెఁ గామదహన! 28

చం. ధవుని ననన్యభావమును దాల్చి భజించు పతివ్రతామణిన్
తెవడు దురాత్మ చంటమున దేవ! మదాంధత బౌద్ధులెల్లరున్
శివు ననవద్యు నాద్యు ఘనుఁ జిన్మయు నుత్తమపూరుషున్ నిరున్
తవిలిభజించు సాధ్వి శ్రుతిఁ దద్దయు దూఱుచునుండి రేమనన్ ?

తే గీ అపుడు కోయంగఁబడు బ్రాహ్మణాళి శీర్ష
పద్మములచేత భైరవు పాదపూజ
కటికి కాపాలికులు చేయఁగడఁగుటయును
దండిభూలోకమర్యాద తగులఁబడియె. 30

కం. ఒక్కడుగు నడచుజనుఁడును
మిక్కిలికష్టములుపడుచు మిడికెడి త్రోవల్
పెక్కులు గల వివి కాకయె
క్రిక్కిఱిసెడి కంటకముల కిరవగు చీశా! 31

ఉ. కావున సర్వదుర్జనుల గ్రక్కునఁ గూల్చి లోకరక్షకై
నీవు జగంబు సౌఖ్యపడ నిల్పుము వైదికమైన మార్గమున్
దేవ! యటంచుఁ బల్కి కడు దీనముఖుండయి కూయుచున్న యా
జీవనజాతగర్భుదెస చెచ్చెర ధూర్జటి చూచి యిట్లనున్. 32

సీ. భువి మనుష్యస్త్రీకిఁ బుట్టి దురాచార
ములఁ దుల్చ ధర్మంబు పూనినిల్ప
అర్థతాత్పర్యంబు లవలీలఁగా సల్పి
బ్రహ్మసూత్రములకు భాష్యరచన

అజ్ఞానమూలమై యంతట నలమిన
ద్వైతమతంబును దగ జయించు
నలువురుశిష్యులు గలిగి భాసిల్లుచు
హరి నాల్గుభుజముల నలరుపగిది
శంకరాహ్వాయ యతిపతి సగవి నగుదు.
ఈరు నావలె నరజన్మ మెత్తి కొంద
ఱట్టె నట్టె జుట్టియుండుదు దిట్ట లగుచు.
అప్పు డీడేలు మీకోర్కు లడ్డులేక. 33

తే. గీ. బ్రహ్మ మొదలగుసురలతోఁ బలుకు చిటుల
క్రౌంచపర్వతభేదిపైఁ బంచవక్త్రుఁ
డన్యదుర్లభ నిజకటాక్షాళిఁ బఱపె
కమలములపైని గిరణముల్ ద్యుమణిమాడ్కి. 34

తే. గీ. పాలసంద్రింపుఁ దరఁగలభాతిఁ దనరు
తత్కటాక్షాళి ప్రసరింపఁ దనదుపైని
కుతుకమును జెందె మిక్కిలి కొమరుసామి
ఉర్విఁ బ్రస్ఫుతేందుకిరణుఁడౌ నుదధివోలె. 35

తే. గీ. మిగుల ధీమంతుఁడై లలి మెలఁగు తనదు
చినకుమారు కుమారుతో ననియె నంత
దంతచంద్రాతపానంది ధాతృముఖ్య
వరనిలింపచకోరుఁడౌ పురహరుండు. 36

శా. ఆలింపఁగావలె సావధానముగ శ్రేయస్సాధనంబై జగ
జ్జాలోద్ధారము గోచరింపఁగల యస్మద్వాక్యముల్ షణ్ముఖా !
పాలింపంగవలెం బో త్రికాండయుతమై భాసిల్లు నామ్నాయముల్
మాలల్ గావుట తప్పి బ్రాహ్మణులకున్ మర్యాద వాటిల్లఁగన్.

కం. తద్రక్షణ జరిగినచో
భద్రాన్వితమగుచు జగము పరిరక్షితమౌ
క్షుద్రజనవ్రజదమనా !
తద్రక్ష్యము లగుట వర్ణధర్మము లెల్లన్. 38

వ. ఇప్పు డిది యుద్ధరింపవలెనను నాదు గూఢభావంబు గుర్తెఱింగి
విష్ణుశేషు లిరువురు మత్సమీపంబున కేతెంచి మధ్యమకాండం

ఉద్ధరింప నానతిచ్చిపుచ్చు నిజాంశంబుల భూలోకంబున నవతరించి
సంకర్షణ పతంజలులను మునీంద్రులై యుపాసనాకాండం బొనరించి
యుండుచున్నవారు. ప్రథమంబగు జ్ఞానకాండం బుద్ధరింప బర్హిర్ము
ఖుల యెదుటఁ బ్రకృత మేను బట్టిన ప్రతిజ్ఞ భవ చ్ఛ్రుతిగోచరము.
జైమినీయన్యాయసముద్రంబునకు శరత్పూర్ణిమాచంద్రుండవై బ్రహ్మ
బ్రాహ్మణ తపో వేదంబుల నిమిత్తము కర్మకాండం బుద్ధరించి
సుబ్రహ్మణ్యుండను ఖ్యాతిం గాంచుము. మహీతలంబునం దవత
రించి శ్రుత్యర్థవిరోధులగు బౌద్ధుల నెల్లరం బోకార్చి వేదచోదితం
బగు మర్యాదం బ్రతిష్ఠింపుము. మండనుండను మహీసురుండగుచుఁ
బితామహుండును సుధన్వుఁడను క్షోణీంద్రుఁడగుచు దేవేంద్రుం
డును నీకు సహాయంబుగ వర్తిల్లెదరని వక్కాణించుటయు బ్రహ్మ
దేవునకును నాజ్ఞాకరంబగు నాదేవదేవు వాక్యంబు దేవసేనాధి
పతియగు కుమారస్వామి సుధాధారంబోలెఁ ప్రసాదంబని పరిగ్ర
హించిన యనంతరంబున 39

క. సురపతి నరపతియై తా
పరిపాలనఁ జేసె ధర్మపథమునఁ బ్రజలన్.
ధర స్వర్గంబొనరిచి తన
పురి నమరావతి నొనర్చెఁ బొగడఁగ నమరుల్. 40

చ. లలి ననవద్యవిద్యుఁడగు లావరి యయ్యును శాస్త్రమందునన్
గొలుపుచుఁ గృతిప్రమాదరము కుంభిని గ్రౌంచవిభేదిరాకకై
సలుపుచుఁ దా నిరీక్షణము చాల ముదంబున బౌద్ధజాలమున్
కలసి మెలంగె నానృపతి కార్యమెఱింగి తదీయువైఖరిన్. 41

తే. గీ. తనకు శ్రీభట్టపాదాఖ్య తగి దిగంగ
నాజనంబున కాభరణంబుగాఁగ
జగతిఁ దత్తారకారాతి జననమందె
అమరవిభుఁడు సుధన్వుఁడై నంతలోన. 42

సీ. తొల్త నమూరుచేఁ దోరంపుఁజీఁకట్లు
విరిసిపో నొక్కింత వెలుఁగుగాంచు
జగమును సూర్యుండు మిగుల వెల్గించిన
పగిదిని దద్భట్టపాదుఁ డపుడు

రహిఁ మున్ను సూత్రముల్ రచియించి జైమిని
సూచింప వానిలో శ్రుతులయర్థ
మద్ది తేటఁగఁ జేసి యఖిలదిశల్ గెల్చు
చా సుధన్వుని ప్రోలు డాసి యతని
కవలఁ దనరాక దెలుపంగ నమ్మహీశుఁ
డతని కెదురేగి తోడ్కొని యరుగుదెంచి
పూజ లొనరింప శాస్త్రోక్తపూర్వకముగ
దీవనలచేత నతని సంతృప్తిఁ జేసి. 43

శా. ఆసీనుండయి హేమపీఠమునఁ బాకారాతిపూఁదోఁటకున్
శ్రీసంధించు వసంతుచందమున ధాత్రీనాథు నాస్థానికిన్
భాసం బెచ్చుచు భట్టపాదకృతి తత్ప్రాంచత్సభామండపా
త్యాసన్నంబగు శాఖఁ గోవెలరవం బాలించి యిట్లెంచుచున్ 44

కం. శ్రుతిదూషకనినదములై
అతిమలినములైన కాకహతకంబుల సం
గతి నీకు లేకయుండిన
క్షితిఁ బొగడఁగఁబడెదు పికమ! సిద్ధం బనుచున్. 45

ఉ. కోవెలమీఁది వ్యాజమునఁ గ్రూరత వైదికనిందసల్పుచున్
కేవల శూన్యవాదులగు నీచులు బౌద్ధుల పొత్తు మానినన్
భూవర! కీర్తి గైకొనెదుపో కర మీవు ధరిత్రిమీఁదనన్
భావము గర్భితంబగుచు భాసిలఁ బల్కిన నాలకించుచున్. 46

చం. కడుఁ బదతాడితంబులగు కట్టిడిపాములభంగి సౌగతుల్
వడిగ సరోషులౌటయును వారల శాస్త్రపుఁదీవె యుక్తియున్
గొడవటఁ ద్రెంచివైచుచును గ్రోధపుమంటలఁ బెద్దఁజేసె నా
బుడుతమనీషి దక్షుఁడయి పుస్తకరూప వరేంధనంబులన్. 47

తే. గీ. రోషయుతులౌటఁ బాటలరుచులు గలుగు
బౌద్ధజనుల ముఖాళిచేఁ బరఁగెఁ గొలువు
ఇలను లేయెండ కొక్కింత యెఱ్ఱనైన
నలినములచేతఁ జెలఁగెడి కొలనువలెను. 48

సహాయులు

౧ మెదక్ కిషన్‌రావు దేశముఖుగారు, నల్లపల్లి.
౨ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
3 తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణము, దుగ్గిరాల.
౪ తిరుమలనల్లాన్ చక్రవర్తివరదాచార్యుల అయ్యవార్లంగారు, శాతాపురము
౫ రాయచూరి బండేరావుగారు, అయినాపురము.
౬ రాజా మంత్రిప్రెగడ రాఘవరావుగారు - లింగగిరి.
౭ చిక్కరాజు మట్టపల్లిరావుగారు - చెలకుర్తి.
౮ నాదరగుల్ సంగమేశ్వరరావు దే॥ గారు శ్రీశ్రీ జగద్గురు పుష్పగిరి సంస్థానపు ఏజంటు.
౯ అద్దంకి ... తిరువేంగడతాత దేశికాచార్యులయ్యవార్లంగారు. తక్కెళ్ళపాడు.
౧౦ మియ్యాపురం రామకృష్ణారావుగారు, కొల్లాపురం.
౧౧ మల్లాది నరసింహమూర్తిగారు, ప్లీడరు, గురజాల.
౧౨ కురికాల వెంకటేశ్వరరావుదేశముఖుగారు, పులిగెళ్ళ.
౧3 రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావుగారు, లింగగిరి.
౧౪ జింకా వెంకటసుబ్బారావుగారు, వకీలు, గురజాల.
౧౫ వద్దిరాజు సత్యనారాయణరావుదేశపాండ్యాగారు, మేడిపల్లి.
౧౬ గొట్టిపర్తి సుబ్బారావుగారు, వకీలు, సింగరేణికాలరీసు.
౧౭ మారేపల్లి వెంకటకిషన్‌రావు, మాధవరావు దేశముఖుగార్లు కాకర్లపల్లి.
౧౮ దంటు లక్ష్మీనరసింహముగారు - సుద్దపల్లి
౧౯ మద్దూరి సాంబయ్యగారు - పొగాకుకంపెని - పరుచూరు.
౨౦ ముద్దు చంద్రయ్య, మారేపల్లి మారుతిరావు దేశముఖుగార్లు కొత్తపల్లి.
౨౧ రాయప్రోలు సుబ్బారావుగారు, ప్రొఫెసర్, యూనివర్సిటి కాలేజి, హైదరాబాదు.
౨౨ పెసర వెంకటరెడ్డి దేశముఖుగారు, పుల్లారెడ్డిపల్లె.
౨3 గడ్డం వెంకటనరసింహారెడ్డి దేశముఖుగారు, చెలుకుపల్లి.

అభినవ సరస్వతి

సంపాదకుఁడు - నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొకమాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును ప్రకటింపఁబడును. చందా సం॥ 1 కి రు 3-0-0

ఈ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు.

1	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
2	నీతిగీతలు (సుమతిశతకము, దానిశ్లోకములు)	...	0	2	0
3	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
4	కరణీకోద్ధారిణి [ప్రాచీనప్రబంధము]	...	0	4	0
5	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
6	పురశ్చరణము	...	0	2	0
7	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
8	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
9	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
10	సూతసంహిత (ఆంధ్రము)	...	2	0	0
11	భారతీయప్రబోధము (పిశుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0
12	ధర్మనిర్ణయము	...	0	4	0
13	అస్పృశ్యతానివారణఖండనము(మల్లాదిరామకృష్ణచయనులుగారు)		0	8	0
14	స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము (౧ సంపుటము)		1	0	0
15	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
16	డిటో నాగరఖండము (౩ సంపుటము)		1	8	0
17	డిటో నాగరఖండము (౪ సంపుటము)		1	8	0
18	పల్నాటివీరచరిత్ర		0	12	0
19	ఆరోగ్యభాస్కరము		0	6	0
20	భాగవతరహస్యములు		0	4	0
21	సోమేశ్వరశతకము		0	2	0
22	జాతకచర్య (స్వకీయులచరిత్ర)		1	8	0

అభినవసరస్వతీ కార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్లపోస్టు,
గుంటూరు జిల్లా.